
వెలకొద్దీ కట్నండబ్బుతో, అంతకుముందు పరిచయమేలేని మగవాడికి అంకితం కావటంకన్నా, మనసు ఎన్నుకొన్నవాడికి సహాయంచేసి, జీవనమార్గాన్ని నిర్మించుకోవచ్చును. అప్పుడది నవలోకమూ అవుతుంది, నవజీవనమూ అవుతుంది.

# నవలోకం

శ్రీ పి.ఎస్.దేవి



"మీ ఫ్రెండ్ రామకృష్ణను అప్పుడప్పుడు చూస్తున్నాను. ఉద్యోగస్తుడనుకున్నాను, స్టూడెంటులా లేడు" అంది జయ.

"పాపం! పరిస్థితులు అనుకూలించి వుంటే ఈ పాటికి వుద్యోగంలో వుండాల్సినవాడే. కాని వున్న కొద్దిపాటి పొలంలో కొంత అమ్మి కొంత అప్పుచేసి కూతురు పెళ్ళి చేశాడట వాళ్ళ నాన్న. కరువుకాటకాలతో అప్పులు తీరకుండానే వాళ్ళ నాన్న పోయాడు. యితను కొన్నాళ్లు చదువు ఆపి యింటిదగ్గర పొలం చూసుకుంటూ అప్పులు తీర్చాడు. యిప్పుడున్న కొద్దిదాంతో అతి జాగ్రత్తగా వాడుకుంటున్నాడుభుక్తికి లోటులేదు. అందుకనిఅతను మధ్యమధ్యలో ట్యూషన్ చెప్పుతుంటాడు. అలాంటి సందర్భంలోనే నాకు పరిచయం అయ్యాడు. తెలివయినవాడేకాని ప్చ్. ఏం జేస్తాం." అని నిట్టూర్చాడు ప్రభాకరం.

"అలా వుత్తి జాలి చూపించే బదులు ఏదైనా సాయం చేయకూడదూ. నీవు యింట్లో పేయింగ్ గెస్ట్‌లా వుంటూ నీజీతం బ్యాంకులో వేసుకుంటున్నావుకదా."

ప్రభాకర్ ఆశ్చర్యంగా చూశాడు. "అయితే నీవనేది ఏమిటి?"

జయ నెమ్మదిగా, స్థిరంగా అంది. "మనిషి చూస్తే నిజాయితీపరుడిలా వున్నాడు. నీకుమూడేండ్లుగా తెలుసన్నావు. అలాంటి వారికే సాయం చెయ్యాలి. ప్రతి దానికి ప్రతిఫలంగా ఇంకొకటి అడుగుతే అది వ్యాపారం అవుతుంది కాని సాయం అన్పించుకోదు. ఇందులో నా పేరు ఎత్తావంటె మర్యాదకాదు. అసలు ఆలోచన విను" అంటూ తన ఆలోచన వివరంగా చెప్పింది.

అంతా వినేసరికి ప్రభాకర్‌కు మతిపోయింది.

"జయా ఇదేమిటే. నువ్వు నిజంగా అంటున్నావా?"

"అహ అక్షరాలానిజమే. ఇష్టం అయితే సాయం చెయ్యి, లేకపోతే నోరుమూసుకో. నా పేరు ఎత్తనని ప్రామిస్ చేశావు గుర్తుంచుకో. అదుగో యిల్లు వచ్చేసింది-మరి వుంటాను."

ఏం చిత్రమైన పిల్ల జయ. మనసులోకి ఆలోచన వచ్చిందంటె ఆచరణలో పెట్టేదాకా వూరుకోదు. ప్రభాకర్ ఆశ్చర్యంలోనే వున్నాడు. రాత్రంతా ఆలోచించి నిశ్చయానికొచ్చాడు.

మరుసటి రోజు తొందరగా తయారయి రామకృష్ణ దగ్గరికెళ్ళాడు. ఉపోద్ఘాతం లేకుండానే అసలు విషయం అడిగాడు.

"వూరికెళ్ళి ఏం చేద్దామని?"

"ఏం లేదు. ఉద్యోగం దొరికేదాకా ఏవైనా ప్రైవేట్లు చెప్పుకుంటూ వుండాలి."

"ఎక్కడో వుండి ప్రయత్నించడం కన్నా, సిటీలో వుండి చూస్తే సులువు. నీవెలాగు ప్రయివేట్లు చెప్పుకోటానికి రెడీ అంటున్నావు. అలాంటివాటికి కూడా సిటీలోనేఅవకాశాలు ఎక్కువ. నీవు వూరెళ్ళి మీ అమ్మగార్ని చూసి వచ్చేయి. మిగతా విషయాలు ఆలోచిద్దాం."

"అంతకంటేనా. తప్పకవస్తాను."

"ఆఫీసు టైమ్ అవుతోంది మరి నేను వస్తాను."

సరిగా నెల అయేసరికి తిరిగి వచ్చాడు రామకృష్ణ. రాగానే వెళ్ళి ప్రభాకర్‌ను కలుసుకొన్నాడు.

"నీకోసమే చూస్తున్నాను. ట్యుటోరియల్ కాలేజీలో టెంపరరీ పోస్టు వుంది చెయ్యాలనుకుంటే."

"ఏదైనా రెడీయే. వక్రమార్గం అవలంభించనంతకాలం ఏదైనా ఫరవాలేదని నా ఉద్దేశ్యం."

ఆ రోజే యిద్దరూ వెళ్ళి ప్రిన్సిపాల్‌ను కలిశారు. అతను పని గురించి చెప్పాడు. మూడు నెలల వరకే, కాని శ్రద్ధగా చెప్పాల్సి వుంటుందని.

రామకృష్ణ సంతోషంగా ఒప్పుకున్నాడు. తిరిగివస్తూంటే అన్నాడు ప్రభాకర్.

"నీవు సి. ఎ. ఎందుకు చేయకూడదూ"

"మొదటికి మోక్షంలేదు కొడుకుపేరు గోవిందు" అన్నట్లు వుంది. ఒకటి స్థిరం లేదు రెండోదా. ఇలాంటి టెంపరరీ వుద్యోగాలు సిటీలో దొరుకుతాయి. అంతగా ఒకటి రెండు నెల్లు ఏదీ లేకపోతే నేను సర్దుతాను. నేను ఎం. బి. ఎ. చదువుతున్నాను. అది పూర్తి అయి మంచి జాబ్‌లో స్థిరపడేదాకా పెళ్ళి ప్రసక్తి లేదు. నా జీతం చాలాభాగం బ్యాంకుకు వెళుతోంది. అందువల్ల నీకు కొద్ది సాయం చేసినా నాకు యిబ్బంది ఏమీలేదు. జీవితంలో ఒక మంచిపని చేశాననే తృప్తి వుంటుంది. వట్టినే తీసుకోటానికి ఇబ్బంది అనిపిస్తే అంతా లెక్క రాసి వుంచు. వుద్యోగంలోకి వచ్చాక తీర్చు."

రామకృష్ణ చలించిపోయాడు, కృతజ్ఞతగా చూశాడు.

"ప్రభాకర్ నీ రుణం తీర్చుకోలేను."

"అంతపెద్ద మాట వాడకు. నేనునడవను నన్ను ఎత్తుకొని మోయండి అంటే ఎవరూ రాదు. కాని కష్టపడి నడుస్తూ చేయూత కొరకు చూసేవాడికి ఎవరైనా సాయం చేస్తారు."

ఇద్దరూ విడిపోయారు.

రామకృష్ణ క్రమంగా ట్యుటోరియల్ కాలేజీకి వెళుతున్నాడు. మొదట్లో బెరుగ్గా వున్నా వారం రోజులయేసరికి నమ్మకం వచ్చింది. ముందే నోట్సు తయారు చేసుకొని వెళ్ళి చెబుతున్నాడు. పిల్లలు శ్రద్ధగా వింటున్నట్లు అనిపించింది. పగలు చాలా టైమ్ వుంటోంది. సి. ఎ మొదలుపెట్టాలి అనుకున్నాడు.

పుస్తకాల కోసం వెళితే సెంటర్లో జయ కనపడింది. కాసేపు తటపటాయించి ధైర్యం చేసి పలకరించాడు.

"హల్లో బాగున్నారా."

"హల్లో కంగ్రాట్స్- మీకు క్లాసు వచ్చింది. పేపర్లో మీ నంబరు చూశాను"

తన నంబరు గురుంచుకొని రిజల్ట్సు చూసింది, అనుకునేసరికి చాలా ఆనందం వేసింది.

"వస్తాను-బస్సు వస్తోంది" అంటూ జయ వెళ్ళిపోయింది.

రామకృష్ణ తిట్టుకున్నాడు. వెధవ బస్సు ఎప్పుడూ యింతే. అవసరం అయినప్పుడు రావు. అనవసరం అనుకున్నప్పుడు త్వరగా వస్తాయి.

సి. ఎ. మొదలుపెట్టాడు చదవటం.

## గాథావళి :

# అరాచకం

డాక్టర్ సి. డి. దేశ్‌ముఖ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గావున్న రోజులవి. డాక్టర్ రామమనోహర్ లోహియా, దేశ్‌ముఖ్‌లు సన్నిహిత స్నేహితులయ్యారు. వారిద్దరూ సాయంకాలం కలుసుకొన్నప్పుడు దేశ పరిస్థితుల గురించి చర్చించేవారు. లోహియా గంభీర స్వభావుడేకాక గొప్ప భావుకుడు. దేశ పరిస్థితి అధ్వాన్నంగా వుందని భావించేవాడు. ఒకనాడు తీవ్ర చర్చ తర్వాత దేశ్‌ముఖ్ లోహియాను ఉద్దేశించి దేశ పరిస్థితిని చక్కదిద్దే మార్గమేదో మీరే చెప్పండి అన్నాడు.




"దేశంలో పూర్తిగా అరాచకం వ్యాపించాలి. ఇదే నా అభిప్రాయం" అన్నాడు లోహియా.

"మీ అరాచకాన్ని మరెక్కడైనా సాగనివ్వండి. మా విశ్వవిద్యాలయ ఆవరణలోకి మాత్రం రానివ్వకండి" అన్నాడు దేశ్‌ముఖ్.

—జానమద్ది హనుమచ్ఛాస్త్రి

15 సెప్టెంబర్ '78 విడుదల!
జనసుధ సచిత్ర వారపత్రిక
వెల 75 పైసలు
ఆఫ్‌సెట్ ముఖ చిత్రంతో వెలువడుతున్న పత్రిక
ఏజెంట్లు త్వరపడండి!
డిపాజిట్లు కట్టి మీ ఏజన్సీని ఖాయ పరుచుకోండి!

అడ్డు అదుపు లేని మా మాస పత్రిక సర్క్యులేషన్ ను అదుపులో పెట్టడానికి సచిత్ర వారపత్రిక వస్తోంది!
వివరాలకు: సర్క్యులేషన్ మేనేజర్ * ఫోన్లు: 62065 : Res 76959
'జనసుధ' బ్రాహ్మణ వీధి : విజయవాడ: 520001
'జనసుధ' ఈవెనింగ్ డెయిలీ
వెల 10 పైసలు
కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం!




పొద్దున కాల కృత్యాలు తీర్చుకొని నోట్సు ప్రిపేరు చేసుకోటం మధ్యాహ్నంచదువు. సాయంకాలం కాలేజి. సెలవుల్లో అప్పుడప్పుడు ప్రభాకర్ యింటికి వెళ్తున్నాడు. వెళ్ళినప్పుడల్లా కళ్ళు వెతికేవి. కాని ఎప్పుడోకాని జయ కన్పించేదికాదు. కన్పించినా పలకరింపుగా రెండు మూడు మాటలు తప్ప మాట్లాడేది కాదు. రోజులు గడుస్తున్నాయి.

ట్యుటోరియల్ కాలేజిలో చేరిన వేళా విశేషమేమోగాని మూడు నెలల గడువు అయ్యేలోపల ఇంకో టీచర్‌కు గవర్నమెంటు వుద్యోగం వచ్చింది. ఆ స్థానంలో మళ్ళీ రామకృష్ణ చేస్తున్నాడు.

ఒకరోజు గాలిదుమారంలా వచ్చాడు ప్రభాకర్ తలుపులు తోసుకుంటూ.

"ఏమిటి హడావిడిగా వచ్చావు? ఏమిటి విశేషాలు."

"విశేషాలకేమిటిబోలెడు. త్వరగాతయారయిరా. నాకు సాయం చేద్దువుగాని మా కరుణ పెళ్ళి కుదిరింది. వారం రోజులే వుంది. చెయ్యాల్సిన పనులు బోలెడు."

"పెళ్ళి చూపులు అయినట్టుగా కూడా చెప్పలేదే. ఎవరు పెళ్ళికొడుకు."

"పెళ్ళి చూపులు, నిర్ణయించుకోడం అంతా అయింది. అతను అమెరికా వెళ్ళి మూడేళ్ళు అయింది. ఒకసారి వాళ్ళ వాళ్ళను చూడడానికి వచ్చాడు. ఎలాగు వచ్చావుకదా పెళ్ళి చేసుకు పొమ్మని వాళ్ళ వాళ్ళు అంటే వచ్చాడు. యిదివరకు తెలిసిన వాళ్ళే. పెళ్ళి చేసుకొని వెంట తీసుకవెళతానంటున్నాడు. అందుకే తొందర. యిప్పుడు దూరంగా వున్న చుట్టాలందరికీ టెలిగ్రామ్‌లు యిచ్చి మిగతా ఏర్పాట్లు చూడాలి. ఈ వారం రోజులు నీవు మా యింటికి రా."

"ఇంత అవస్థ, హైరాన పడే బదులు సింపుల్ రిజిష్టర్ మ్యారేజి చేసుకొని చిన్న టీ పార్టీ యిస్తే హాయి."

"కానీ, మనవాళ్ళ చాదస్తాలు వున్నాయి కదా. చుట్టాలందరినీ పిలిచి విందులు, బట్టలుపెట్టి, మర్యాదలు సరిగా జరగలేదని, బట్టలు నాణ్యంగా లేవని వాళ్ళ చేతనే తిట్టించుకుంటేనే మన వాళ్ళకి తృప్తి."

"సరేలే. ఎవరి పిచ్చి వారి కానందం పదపద" అంటూ లాక్కెళ్ళాడు.

ఆ వారం రోజులు రామకృష్ణ యింటి మనిషిలాగే అన్ని పనులు చూశాడు. జయ కూడా చాలా హడావిడిగా తిరుగుతోంది. అందరికీ కాఫీలు టిఫిన్‌లు చూస్తోంది. జయ, కరుణ స్నేహితులు కూడా ఇంటి వాళ్ళలాగే అన్నిటిలోను సాయం చేస్తున్నారు. సాయంకాలం టీ లవగానే ప్రభాకర్ పిలిచాడు. "జయా త్వరగా మార్కెట్ కెళ్ళాలి పద. నీవు కూడా పదవోయ్ రామకృష్ణా. మన వాళ్ళ చాదస్తాలు చూడు. ఒక వుంగరం తక్కువయిందట. ఇప్పుడు పరుగులు" విసుక్కుంటూ యిద్దరినీ వెంటేసుకుని వెళ్ళాడు.

షాపులో అందమైనవుంగరాలు ఎన్నో- వాటిలో ఒకటి ఏరటం చాలా కష్టం అనిపించింది జయకు.

ప్రభాకర్ తొందరచేశాడు. టైమ్ లేదు. ఏదో ఒకటి కానీ జయ ఆఖరికి రెండు ఏరింది.

"చూడన్నయ్యా. ఇది నీవు కొనమన్నది. ఇంకో దానికి నేను డబ్బిస్తాను. కరుణకు ప్రజంటేషన్‌గా యిస్తాను."

కాని అతను కొననివ్వలేదు. "నీకు పిచ్చేమిటే. కరుణ యిన్ని వుంగరాలతో అమెరికా వెళ్తుందా? అనవసరంగా డబ్బు వేస్టు చేయకు. ఏదైనా అవసరవుండే వస్తువు యివ్వాలిగాని."

జయ అయిష్టంగానే కదిలింది. మనసంతా ఇంకో వుంగరం మీదే వుంది.

పెళ్ళి సరదాగా జరిగింది. మరురోజే కరుణ అత్తగారింటికి వెళ్ళింది. వచ్చిన చుట్టాలందరూ ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. అద్దెకు తెచ్చిన సామాను లెక్క చూసి ప్రభాకర్ రామకృష్ణ లిస్ట్‌లో వేయిస్తున్నారు.

ఇదిగో అన్నయ్యా లిస్ట్-అన్నీ సరిగ్గానే వున్నాయి. ఇక నే వెళ్తాను."

"వుండు రామకృష్ణనుకూడా పంపించాక వెళ్దువుగాని. చాలా థ్యాంక్స్ రామకృష్ణా, చాలా సాయం చేశావు."

"వాళ్ళ చెల్లి పెళ్ళి చేసిన అనుభవం వుంది కదా మరి" అంది జయ.


## ఫెస్టివల్ గ్రేట్ ఆఫర్

జులై 1978 బహుమతులు గెలుపొందినవారు బి.పి. లీలావతి బసినేకొండ చిత్తూరు మరియు ఆర్. గీతా తిగ్లార్‌పేట, బెంగుళూరు-2.

బహుమతులు : వాచ్, కెమెరా, టేప్‌రికార్డర్, రికార్డు ప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ (ఏదైనా ఒక బహుమతి మా అభీష్టంపై) ఎంట్రీ ఫీజు లేదు. కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : ఆర్ట్ సిల్క్ ప్రింటెడ్ చీర 60 రూపాయలకు. ఇది అమ్మకం అభివృద్ధి పథకం.

| | | |
|---|---|---|
| 10 | 15 | 8 |
| 9 | 11 | 13 |
| 14 | 7 | 12 |

సహాయమునకు 33

నిబంధనలు : తెల్లకాగితముపై 8 నుంచి 16 వరకుగల అంకెలని ఒకసారి మాత్రమే వాడి ఎటు కూడినా మొత్తం 33 వచ్చునట్లుగా వేయవలయును. 2. బహుమతి గెలిచినవారికి పోస్టేజి, ప్యాకింగ్ ఫీజు చెల్లించుటకు తెలియపర్చబడును. వివాదములు ఆలీఘర్ జ్యూరీస్ డిక్షన్‌లోనే. ఎంట్రీలు హిందీ, ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ఆఖరి పోస్టింగ్ తేది : 23-9-78

ATLAS TEXTILES (AJWV-36) P. B. No. 95, Aligarh-202001.

# ఉట్ల పండుగ



ఆనాడు వ్రేపల్లె ఎంతగొప్పది! ఒకప్రక్క నుంచి యమునా నది నల్లని కోక కట్టుకొని వయ్యారంగా సాగిపోతూంటుంది. ఆయేటి గట్టున ఆకుపచ్చని పచ్చికతో కలకల్లాడే మందబయళ్ళు. ఆ బయళ్ళలో లక్ష్మీదేవుల్లాగ అందాలు చిందే ఆలమందలు. వ్రేపల్లె నిజానికి చాలా మంచి వూరు.

ఆ వూళ్ళో పిల్లలు మరీ మంచివారు. మంచితనాన్ని మించిన చక్కదనంతో వాడవాడలా పేరుమోసినవారు గోపికలు. కాకపోతే అందరికన్నా గొప్పవాడైన గోపాలకృష్ణుని తమవాణ్ణి చేసుకోగలుగుతారా? అంత చక్కని వారైనా, పాడిపంటలెంత కొల్లలుగావున్నా, వ్రేతల కన్నెలు సోమరులు మాత్రం కారు.

శ్రీకృష్ణుడు పెద్దవాడయాక రాజకీయాల్లోనూ, రణరంగాల్లోనూ ఆరితేరినవాడు కావచ్చు. భగవద్గీతను బోధించిన వెలుగురేఖ కావచ్చు. ఆర్తత్రాణ పరాయణుడు కావచ్చు. సాక్షాత్తూ మహావిష్ణువవతారమే కావచ్చు.

కాని చిన్నతనంలో ఆయన పచ్చిదొంగ. వ్రేతల పల్లెలో ముద్దియలనూ, వెన్నముద్దలనూ దొంగిలించడంలో ఆరితేరినవాడు. ఎంతమారుమూలదాగిన గోపికనైనా వెదకి పట్టుకునేవాడు. ఎంత ఎత్తుగా కట్టిన వుట్టిపైకైనా యెగిరి నవనీతాన్ని తీసుకు తినేవాడు. తానొక్కడూ తినేవాడా? తన సావాసగాళ్ళందరినీ పిలిచి తినిపించేవాడు. వెన్నలతోపాటు గొల్లకన్నెల చేత తన్నులుకూడా తినిపించేవాడు. రెండూ మధురమైనవే!

ఉట్లపై కెగిరి వెన్న మీగడలూ, పాలు పెరుగులూ తీసుకోడం ఆనాడు శ్రీకృష్ణుని దగ్గర నేర్చుకున్నారు యాదవులు. నాటి నుంచి వారికది సదాచారమయిపోయింది. నేడుకూడా అది జరుగుతూనేవుంది. ఆ జరగడం ప్రతిరోజూ కాదు; కృష్ణాష్టమి నాడే.

ఈ పండుగ పల్లెటూళ్ళలో ఎక్కువగా జరుగుతుంటుంది. వూళ్ళోపెద్దలు తమ యిళ్ళముందు దారిలో ఇటో రాటా అటో రాటా పాతి, వాటిపైన అడ్డంగా వెదురు వాసం బిగిస్తారు. ఆ వాసానికి నడుంగా ఒక గిలక నమరుస్తారు. తోడు పెరుగు గాని, వెన్నగాని ఒక పిడతలో పోసి, ఆ పిడతనొక వుట్టిలో వుంచుతారు. ఆ వుట్టెకు పొడుగుపాటి తాడు కట్టి, గిలక మీదనుంచి వేలాడతీస్తారు. గాబులతోనూ, బిందెలతోనూ చల్లని నీళ్ళను నింపి దారికి రెండుపక్కలా వుంచుతారు. వెదురు బొంగులతో తయారు చేసిన చిమ్మన గొట్టాలు పట్టుకుని, పిల్లలు నిలబడి వుంటారు. పిల్లలేమిటి? పెద్దలు - స్త్రీ పురుషులు కూడా సరదాపడే పండుగ యిది.

"ఉట్టె కెక్కలేనమ్మ స్వర్గాని కెక్కగలదా" అనే సామెత వుండనే వుందిగదా! ఏ కార్యమైనా సాధించాలంటే కృషి ఆవసరం; ఆ కర్మ నిష్కామంగా చెయ్యి అని భగవద్గీత బోధిస్తుంది. "కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన" "పట్టినపట్టు విడవకు; ఫలితం చేతికి అందుతుంది." అంటుందీ పండుగ. కష్టాల్ని సహించగలవాడే కార్యసాధకుడు అని చాటి చెప్తుంది. ఉట్ల పండుగ.

వింజమూరి శివరామారావు

---

"అపును యిప్పుడు రెండు పెళ్ళిళ్ళ అనుభవం వుందికదా! మా జయపెళ్ళిక్కూడా నిన్నే పిలుస్తాను తప్పక రా" అన్నాడు నవ్వి.

ఒక రోజు జయ బస్సు దిగే సమయానికి రామకృష్ణ వెయిట్ చేస్తున్నాడు. జయ బస్సు దిగగానే పలుకరించాడు.

"హల్లో! బాగున్నారా, మీతో ఒక విషయం మాట్లాడాలి."

"చెప్పండి."

రామకృష్ణ నవ్వాడు. "అంత త్వరగా అయ్యే విషయంకాదు. ఎక్కడ కలుసుకోమంటారు. ఆదివారం అయిదు గంటలకు పార్కు కొస్తారా?"

జయ తటపటాయించింది.

"మీకు పార్కుకు రావటం అభ్యంతరం అయితే మా స్కూల్ లో విజిటర్స్ రూమ్స్‌లో కల్సుకోండి. అందరి మధ్యలో కన్నా కాస్త ప్రశాంతంగా మాట్లాడాలి అని నా ఉద్దేశ్యం."

"అబ్బే అభ్యంతరం ఏముంది? సరే, పార్కుకే వస్తాను."

"థాంక్స్. మరి వస్తాను."

అనుకున్న ప్రకారం జయ ఆదివారం సాయంకాలం పార్కు చేరింది. ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్టుగా గేటుదగ్గరే వున్నాడు రామకృష్ణ. జయను చూడగానే ముఖం విచ్చుకుంది.

"రండి ఆ చెట్టు క్రింద కూర్చుందాం."

యిద్దరూ మౌనంగా కూర్చున్నారు. కాసేపు ఆగి అన్నాడు రామకృష్ణ.


"కథల్లో చదువుతాం. సినిమాల్లో చూస్తున్నాం. కాని, నిజజీవితంలో యిలాంటి విషయాలు సూటిగా ఎలా మాట్లాడాలో తెలియదు. ఎంగేజిమెంట్ రింగ్ గురించి చెప్పినప్పుడు నాడి వన్‌వే ట్రాఫిక్ అన్నాను గుర్తుందా మీకు."

జయ నవ్వింది. "అవును గుర్తే. ఇప్పుడు సెకండ్ వే ఓపెన్ అయిందా"

"ఆ సంగతి తెల్సుకోటానికే కదా ఇప్పుడు వచ్చింది."

"ఓ.... అయితే రాయబారం నడపాలన్నమాట. అలాగేలెండి ఆ అమ్మాయి అడ్రసు చెప్పండి."

"అడ్రసు తరువాత - ముందు ఆ అమ్మాయి గురించి వినండి. ఆ అమ్మాయిని ఓ ఫ్రెండ్ యింట్లో చూశాను. ఎవరి ముఖంలోకైనా సూటిగా చూసేచూపులు - అంటే ఎవరికి బెదిరే మనిషి కాదన్న మాట. సూదిగా వుండే ముక్కు - అంటే ఏదైనా సూటిగా చేయటం తప్ప అడ్డదారులు తొక్కటం అలవాటు లేదన్న మాట. సన్నటి పెదవులతో బిగపట్టినట్లున్న మూతి అంటే ఏదైనా నిర్ణయించుకున్నాక మరి




మార్చుకోవటం అన్నదిలేదు అన్నమాట. ఇలాంటివాళ్ళు ఎన్ని ఇబ్బందులొచ్చినా వాళ్ళ నమ్మకాలమీద నిలబడతారు. ఇలాంటి వాళ్ళంటే నాకు చాలా యిష్టం."

"అయితే చాలానే స్టడీ చేశారన్న మాట."

"దాదాపు రెండేళ్ళబట్టి చూస్తున్నాను."

"మరి ఇన్నాళ్ళు ఆలస్యం చేశారేం?"

"దేనికైనా సందర్భం కావాలికదా. ఆమెతో పరిచయం పెరిగిన కొలదీ నాకు కావాల్సింది ఈమే అనుకున్నాను. ఆశలు పెంచుకొన్నాను. కాని నేను అర్హుడినో, కానో అనే భయం పట్టుకుంది. ఇంకా ఆలస్యం చేస్తే, ఆలస్యం అమృతం విషం అయ్యే పరిస్థితి. అందుకే ధైర్యం చేసి మిమ్మల్ని ఆహ్వానించాను. ఇప్పుడు చెప్పండి నాకా అర్హత వుందంటారా?"

"ఇది మరీ బాగుంది. ఆమె ఎవరో తెలియకుండా ఎట్లా?"

"మీరు చాలా తెలివైనవారు. నేనింత చెప్పాక కూడా మీకర్థం కాలేదంటే నేన్నమ్మను. నా నోటి నుంచి స్పష్టంగా వస్తేగాని మీరు కమిట్ అవదల్చుకోలేదన్న మాట. సరే ఆమె మీరే అనుకోండి."

"నా గురించి మీకు పూర్తిగా తెలియదనుకుంటా. కట్నంగాని, అదే యింకో రూపేణాగాని తీసుకునే వాళ్ళంటే నాకసహ్యం. తమకు సంపాదించుకునే సామర్థ్యంలేక ఇంకొకళ్ళ కష్టార్జితంతో సరదాలు తీర్చుకొనేవాళ్ళు అల్పులుగా తోస్తారు. నేను మీ గురించి వినటం-మీరు స్వయంకృషితో పైకొచ్చారని చెప్పాడు అన్నయ్య. మీరంటే నాకు గౌరవం వుంది."

"అంటే గౌరవించటానికి తప్ప పెళ్ళాడ్డానికి పనికి రానంటారు."

"మై గాడ్ మీరెంత త్వరగా అపార్థం చేసుకుంటారు."

"నాకంతే అర్థం అయింది మరి."

"మీరంటె రెండేళ్ళబట్టి ఆలోచిస్తున్నారు కనుక మీ అభిప్రాయం స్పష్టంగా చెప్పారు. హఠాత్తుగా అడిగితే నేనేం చెప్పేది."

"నా గురించి రెండురోజులు కూడా ఆలోచించలేనంటారా."

జయ సిగ్గుపడింది. "అంత సూటిగా అడిగితే ఎలా చెప్పేది"

"అంతకన్నా మార్గం కనిపించలేదు. ఇన్నాళ్ళనుంచి మీ గురించే ఆలోచిస్తున్నాను. మీ కిష్టమయితే ధన్యుణ్ణి. అఫ్‌కోర్సు యింత హఠాత్తుగా అభిప్రాయం చెప్పటం కష్టమే. రెండు రోజులు ఆలోచించుకొని చెప్పండి. మళ్ళీ బుధవారం కలుసుకుందాం. మీరు బుధవారం రాకపోతే ఇష్టంలేదని ముఖంమీద చెప్పటం ఇష్టంలేక మానేశారనుకుంటాను. వస్తే ఇష్టమే అనుకొంటాను-ఎలావుంది అరేంజిమెంటు."

"బాగానే వుంది. మీకు తొందరపాటు నిరాశావాదం కొంచెం ఎక్కువ అనుకొంటాను."

"అది మారటం మీమీదే ఆధారపడి వుంది. ప్రతివాడు తృప్తిగాగాని, అసంతృప్తిగాగాని వుండటం అనేది ఆ స్త్రీపై ఆధారపడి వుంటుంది."

"ప్రతి ఆడదాని సుఖం, సంతోషం కూడా పురుషుడి మీదే ఆధారపడి వుంటుంది."

"మగవాళ్ళకి స్వతహాగా ఆవేశం, తొందరపాటు ఎక్కువ. స్త్రీ ప్రతిదీ సహనంతో స్థిరంగా ఆలోచిస్తుంది, అందుకే ఎక్కువ బాధ్యత ఆడవాళ్ళదే అనిపిస్తుంది."

"తప్పు ఆడవాళ్ళమీద తోసేస్తే మీకే బాధ్యత వుండదని ఈ పక్షపాతం."

రామకృష్ణ నవ్వాడు.

"చీకటి పడుతోంది. మరి నేవస్తాను."

రామకృష్ణ, జయలకు ప్రభాకర్ సమక్షంలో రిజిష్టర్‌మ్యారేజి జరిగిపోయింది. రామకృష్ణకు బొంబాయిలో ఉద్యోగం దొరికింది. జయ కూడా వెళ్ళి అక్కడే చిన్న స్కూల్లో ఉద్యోగం సంపాదించుకొంది. ఆరు నెలలు గడిచాక జీవితంలో స్థిరపడ్డాం అనిపించింది.


## బంపర్ ఫెస్టివల్ ఆఫర్

జులై 1978 బహుమతులు గెలిచినవారు : జి. శాంతి. ఉలుందర్‌పేట. తమిళనాడ్ మరియు లీలాదేవేంద్రకుమార్. భవ్‌నగర్ (గుజరాత్) ఎంట్రీ ఫీజు లేదు

బహుమతులు : వాచ్. కెమెరా. టేప్‌రికార్డర్. రికార్డ్ ప్లేయర్ ప్రెషర్‌కుక్కర్ (మా అభీష్టంపై ఏదో ఒక బహుమతి.) కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : సోని సూపర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్ అమ్మకం ధర 135/-. ఇది అమ్మకం అభివృద్ధి పథకం.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

నిబంధనలు : 1. తెల్ల కాగితంపై నమూనాలో ఇవ్వబడిన రీతిగా గళ్ళు గీసి 6 నుండి 14 వరకుగల అంకెలను ఒకసారి మాత్రమే వాడి ఎటు కూడినా మొత్తం 30 రావలయును. 2. బహుమతి గెలిచినవారు పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. వివాదములు ఆలీఘర్ జ్యూరిస్ డిక్షన్‌లో మాత్రమే. ఎంట్రీలు హిందీ లేక సహాయమునకు 27 ఇంగ్లీషులో మాత్రమే పంపండి.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 24-9-78

MAYUR TRADERS (AJWV 30) ALIGARH.30